



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 41 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | శనివారం 18 అక్టోబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :41 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | SAT 18 OCTOBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఈ పథకంలో ప్రజలందరూ
# భాగస్వాములు కావాలి

- 'పి-4 జీరో పావర్టీ'లో పౌరులంతా భాగస్వాములు కావాలని సీఎం పిలుపు
- అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో పోస్ట్
- పేదరికం లేని రాష్ట్రమే స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యమన్న చంద్రబాబు
- 16 నెలల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వెల్లడి
- పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన నిర్మూలన అని స్పష్టం
- ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాల గురించి ప్రస్తావన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పి-4 జీరో పావర్టీ' (పేదరిక నిర్మూలన) కార్యక్రమంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 'అంత ర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం పేదలకు ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, ఎదుగుదలకు సమాన అవకాశాలు కల్పించి, అందరితో సమానంగా ముందుకు సాగేలా చేయడమే అసలైన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రధాన ధ్యేయం కూడా పేదరిక నిర్మూలనేనని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకే తమ కూటమి ప్రభుత్వం తొలిరోజు నుంచే పనిచేస్తోందని తెలిపారు. గడిచిన 16 నెలల్లో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన సంక్షేమ

వివరాలు 2లో..



## తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తాం'

- తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్
- తమిళనాడు నుంచి వచ్చినట్లు గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు
- భారీగా మోహరించిన బాంబ్, డాగ్ స్క్వాడ్స్ బలగాలు
- గంటల తరబడి తనిఖీలు.. ఏమీ లభించలేదని వెల్లడి
- గత 15 రోజులుగా వరుసగా వస్తున్న బెదిరింపులు

పెన్ పవర్ డెస్క్:తిరుపతి కలెక్టరేట్ కు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. కలెక్టర్ కార్యాలయాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ ఓ ఆగంతుకుడి నుంచి వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్ శుక్రవారం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు అప్రమత్తమై కలెక్టరేట్ ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి.

**తమిళనాడు నుంచి బెదిరింపు**

గురువారం రాత్రి 10 గంటల సమయంలో కలెక్టరేట్ అధికారిక మెయిల్‌కు ఈ బెదిరింపు సందేశం వచ్చింది. "కలెక్టరేట్‌ను బాంబులతో పూర్తిగా పేల్చేస్తాము.

వివరాలు 2లో..

## నటుడు విజయ్ టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

- కరూర్ తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతి
- టీవీకే పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు
- గుర్తింపు లేనందున హోదా రద్దు అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపిన ఈసీ




పెన్ పవర్ డెస్క్:తమిళ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టు ధర్మాసనానికి నివేదించింది. కరూర్‌లో విజయ్ ప్రచార

వివరాలు 2లో..

## పరకామణి చోరీ కేసు: టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

- తిరుమల పరకామణి చోరీ కేసుపై హైకోర్టులో విచారణ
- కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఈవోపై ఆగ్రహం
- ఈ నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఈవోకు ఆదేశం



తిరుమల పరకామణిలో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది.

వివరాలు 2లో..

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి
### ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులపై కర్ణాటక సీఎం



- కర్ణాటకలో సామాజిక, ఆర్థిక సర్వేపై నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్య
- రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై ఆ దంపతులకు కొన్ని అపోహలు ఉన్నాయన్న సిద్ధరామయ్య
- నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లు ఇది వెనుకబడిన వర్గాల సర్వే కాదన్న ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతే తానేమీ చేయలేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై

వివరాలు 2లో..

## ఏపీ ఐపీఎస్ అధికారి సంజయ్ కస్టడీ పొడిగింపు

- సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- అక్టోబర్ 31 వరకు రిమాండ్ విధించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు
- ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో తీవ్ర ఆరోపణలు
- గతంలోనే సంజయ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం
- వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సంజయ్
- టెండర్ల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలు




వివరాలు 2లో..

## ఏపీకి వర్ష సూచన... మూడు జిల్లాలకు అలర్ట్

- చురుగ్గా కదులుతున్న ఈశాన్య రుతుపవనాలు
- నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచన
- పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- హెచ్చరికలు జారీ చేసిన విపత్తుల నిర్వహణ సంస్థ
- మరో 13 జిల్లాల్లో మోస్తరు వర్షాల అంచనా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



పెన్ పవర్ డెస్క్:ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా మూడు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, శనివారం నాడు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాలు పిడుగులతో కూడి ఉండే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో చెట్లు, భారీ హోర్డింగులు, విద్యుత్ స్తంభాల కింద నిలబడటం సురక్షితం కాదని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!



- బీహార్ ఎన్డీయేలో విభేదాలు లేవన్న కేంద్రమంత్రి అమిత్ షా
- నితీశ్ కుమార్ నాయకత్వంలోనే ఎన్నికల బరిలోకి దిగుతామని స్పష్టీకరణ
- ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికల తర్వాతే నిర్ణయిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో నితీశ్ కుమార్ నాయకత్వంలోనే కూటమి పోటీ చేస్తుందని స్పష్టం చేసిన ఆయన, ఎన్నికల తర్వాతే ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పి రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించారు.

వివరాలు 2లో..

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

- ప్రధాని మోదీపై ఎక్స్‌లో వైఎస్ షర్మిల విమర్శలు
- కర్నూలులో మోదీ దీపావళి టపాసు తుస్సుమందన్న షర్మిల
- ఏపీకి వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషమంటూ ఎద్దేవా



పెన్ పవర్ డెస్క్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని పర్యటన ఒక "తుస్సుమన్న దీపావళి టపాసు"లాంటిదని ఆమె ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషం కట్టారని, శ్రీశైలం మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలకు తెరలేపారని

వివరాలు 2లో..

## మావోయిస్టు ఉద్యమానికి పెను దెబ్బ: ఒకేసారి 200 మంది లొంగుబాటు

- బస్తర్‌లో లొంగిపోనున్న మావోయిస్టులు
- సీఎం విష్ణు దేవ్ సాయి సమక్షంలో లొంగుబాటు కార్యక్రమం
- మావోయిస్టు ఉద్యమానికి తగిలిన అతిపెద్ద ఎదురుదెబ్బ
- ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం విజయవంతం
- రెండు రోజుల్లోనే 258 మంది మావోల లొంగుబాటు



పెన్ పవర్ డెస్క్:ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. దండకారణ్యం ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకులు సహా సుమారు 200 మంది

వివరాలు 2లో..



## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

- జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ
- 2014లో 5గా ఉన్న జాతీయ జలమార్గాలు ఇప్పుడు 111కి పెంపు
- పదేళ్లలో 18 నుంచి 145 మిలియన్ టన్నులకు చేరిన సరకు రవాణా
- రివర్ టూరిజంలోనూ భారీ వృద్ధి... 25 క్రూయిజ్ నౌకలు ఏర్పాటు
- వికసిత్ భారత్ లక్ష్యంలో జలమార్గాలే కీలకమన్న కేంద్రం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# లోకేష్ మార్క్ ఎకోసిస్టమ్

ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే అతి పెద్ద డేటా సెంటర్ రావడం సంచలనంగా మారింది. ఇష్టం లేని వాళ్లు అదో నిరర్థక పెట్టుబడి అంటున్నారు. భారీ రాయితీలు ఇచ్చారని అంటున్నారు. ఎవరి వాదన వారు చెబుతున్నారు. కానీ ఆ పెట్టుబడి ఎంత ముఖ్యమైనదో.. ఇండస్ట్రీ గుర్తించింది. అందుకే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ను వారు చూస్తున్నారు. ఏపీలో వేగంగా సాగుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాలు, ఎకో సిస్టమ్ ఏర్పాటు వంటివి ముందు ముందు పెట్టుబడుల వెల్లువకు కారణం కాబోతున్నాయని ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో స్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పారిశ్రామిక వర్గాలకు మొదటి చాయిస్ గా మారింది. ఏపీ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. నిజానికి ఏపీకి రావాల్సిన అవసరం ఏ పారిశ్రామిక సంస్థకూ లేదు. ఎందుకంటే ఏపీకి మూడు వైపులా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ఉన్నాయి. ఆ నగరాలు ఉన్న మూడురాష్ట్రాలు పారిశ్రామికంగా ఎంతో ముందు ఉన్నాయి. వాటి వైపు వెళ్లకుండా.. ఏపీకి పరిశ్రమల్ని తీసుకురాగలగడం చిన్న విషయం కాదు. కానీ పదహారు నెలల్లోనే అలాంటి సమస్యల్ని పరిష్కరించి ఏపీ పారిశ్రామిక వర్గాలను ఆకట్టుకుంటోంది. ఏపీతో చర్చలు జరిపేందుకు పెద్ద ఎత్తున పారిశ్రామికవర్గాలు ఆసక్తి చూపిస్తున్నాయి. గతంలో చర్చలు జరిపిన ఫాక్స్ కాన్ వంటి సంస్థలు ఇప్పుడు తమ పెట్టుబడుల ప్రణాళికల్ని వేగవంతం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. గూగుల్ డేటా సెంటర్ కారణంగా అక్కడ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు పెద్ద ఎత్తున ఇతర సంస్థలూ ముందుకు వస్తున్నాయి. కాగ్నిజెంట్ , యాక్సెంచర్ లాంటివే కాదు.. మధ్యస్థ ఐటీ కంపెనీలు కూడా పెద్ద ఎత్తున తమ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నాయి. విశాఖలో నవంబర్‌లో జరగనున్న పెట్టుబడుల సదస్సులో పాల్గొనే .. ప్రపంచప్రసిద్ధ పారిశ్రామిక వేత్తల సంఖ్య గూగుల్ పెట్టుబడి కారణంగా పెరిగే అవకాశం ఉంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా సీఐఐ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సు రాష్ట్ర పెట్టుబడుల చరిత్రను తిరిగరాసే అవకాశం ఉంది. అందు కోసం చాలా కాలం నుంచే ప్రభుత్వం కసరత్తు చేస్తోందిఐదు సంవత్సరాల్లో ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా నారా లోకేష్ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఎంవోయూలు చేసుకుని టైంపాస్ చేయాలని ఆయన అనుకోవడం లేదు. నేరుగా ఎగ్జిక్యూషన్ కే ప్రాధాన్యం ఇస్తున్నారు. పనులు ప్రారంభించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అందుకే.. పెట్టుబడులు గ్రౌండింగ్ కోసం ఎదురు చూడాల్సిన పనిలేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోకేష్ మార్క్ ఎకోసిస్టమ్ ఏపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చనుంది.

# భారతదేశ పురోగతికి నదులే రహదారులు

భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం, తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 2013-14లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 2024-25 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు.

అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినళ్లను ఆధునికీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.

# ఏపీ ఐపీఎస్ అధికారి సంజయ్ కస్టడీ పొడిగింపు

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్. సంజయ్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం అక్టోబర్ 31 వరకు పొడిగించింది. శుక్రవారం కస్టడీ గడువు ముగియడంతో ఏసీబీ అధికారులు సంజయ్‌ను కోర్టు ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కాగా, ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు అక్టోబర్ 13న తిరస్కరించిన విషయం తెలిసిందే. 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సంజయ్, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల డీజీగా, సీఐడీ అదనపు డీజీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో అగ్నిమాపక శాఖ కోసం 'అగ్ని-ఎన్‌ఓసీ' వెబ్ పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించడంలో టెండర్ల నిబంధనలను ఉల్లంఘించారని ఆయనపై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. టెండర్లు పిలవకుండానే కొన్ని పరికరాలను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చారని ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రైవేట్ కంపెనీలకు చెల్లింపులు, ప్రాజెక్టుల అమలులో జరిగిన అవకతవకలపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

ఈ కేసులో తొలుత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఆగస్టు 26న ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా ఉన్న సంజయ్, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై నమోదైన స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసుల దర్యాప్తును పర్యవేక్షించారు. ఆ కేసుల్లో చంద్రబాబు అరెస్ట్ అయి సుమారు రెండు నెలల పాటు జైలులో ఉన్నారు. 2024 జూన్‌లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, సంజయ్‌ను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయనపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం సంజయ్‌ను సస్పెండ్ చేయగా, ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తోంది.

## తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తాం'

- మొదటి పేజి తరువాయి

సిద్ధంగా ఉండండి" అని అందులో హెచ్చరించారు. అధికారులు వెంటనే దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ మెయిల్ తమిళనాడు ఐపీ అడ్రస్ నుంచి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

**గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీలు**

ఈ మెయిల్ సమాచారం అందిన వెంటనే, తిరుపతి పోలీస్ కమిషనర్ డాక్టర్ వి. సురేష్ కుమార్, ఎస్పీ కె. రమణ ఆధ్వర్యంలో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. కలెక్టర్ ఛాంబర్, జాయింట్ కలెక్టర్ కార్యాలయం, ఇతర శాఖల గదులు, పార్కింగ్ ప్రాంతంతో పాటు సమీపంలోని భవనాలను కూడా గంటల తరబడి జల్లెడ పట్టాయి. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభించకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గత 15 రోజులుగా తిరుపతి కలెక్టరేట్‌కు ఇలాంటి బెదిరింపు మెయిల్స్ వస్తూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో సాధారణ హెచ్చరికలతో మెయిల్స్ రాగా, ఈసారి నేరుగా పేల్చివేస్తామని బెదిరించడంతో అధికారులు దీన్ని మరింత తీవ్రంగా పరిగణిస్తున్నారు.

ఈ ఘటనపై కలెక్టర్ డాక్టర్ ప్రారంభ్ దాస్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పోలీసులతో కలిసి దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, "ఇలాంటి మెయిల్స్ పంపడం చట్టవిరుద్ధం. దీని వెనుక ఉన్న వారిని తప్పకుండా పట్టుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు.

## ఈ పథకంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- మొదటి పేజి తరువాయి

, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతినెలా రూ. 2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 207 'అన్నా క్యాంటీన్లను' పునఃప్రారంభించి, కేవలం రూ. 5కే పేదల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. 'దీపం 2.0' పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో, ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. 'స్త్రీ శక్తి' పథకంతో మహిళలందరికీ

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అదేవిధంగా, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు తొలి విడతగా రూ. 7,000 జమ చేశామని, మత్స్యకారులకు రూ. 246 కోట్లు, ఆటో డ్రైవర్లకు రూ. 435 కోట్లు అందించామని ఆయన తన పోస్ట్‌లో వివరించారు.

## నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!

- మొదటి పేజి తరువాయి

బీహార్‌లోని అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై విభేదాలు తలెత్తాయని, పార్టీల మధ్య మనస్పర్థలు వచ్చాయని మీడియాలో వస్తున్న వార్తలపై అమిత్ షా స్పందించారు. అవన్నీ నిరాధారమైన కథనాలని, వాటిలో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అన్ని మిత్రపక్షాలు ఐక్యంగానే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి అమిత్ షా మాట్లాడుతూ, "నితీశ్ కుమార్ సీఎం అవుతారా? లేదా? అని నిర్ణయించేది నేను కాదు. ప్రస్తుతానికి ఆయన నాయకత్వంలోనే మేము ఎన్నికలకు వెళుతున్నాం. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ, దాని మిత్రపక్షాలన్నీ కలిసి కూర్చొని తమ నాయకుడిని ఎన్నుకుంటాయి" అని వివరించారు. ఈ వ్యాఖ్యలతో సీఎం అభ్యర్థిపై ఒకరకమైన సస్పెన్స్‌ను కొనసాగించారు. 2020 ఎన్నికల నాటి పరిస్థితులను ఆయన గుర్తుచేశారు. "గత ఎన్నికల్లో జేడీయూ కన్నా బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుచుకుంది. ఆ సమయంలో నితీశ్ కుమార్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి, బీజేపీ నుంచే ముఖ్యమంత్రి ఉండాలని ప్రతిపాదించారు. కానీ, మేము మిత్రపక్షానికి, సీనియారిటీకి ఎప్పుడూ గౌరవం ఇస్తాం. అందుకే నితీశ్‌ను సీఎం చేశాం" అని అమిత్ షా తెలిపారు.

కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. నవంబర్ 6న తొలి దశ, నవంబర్ 11న రెండో దశ పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి ఘన విజయం సాధిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

- మొదటి పేజి తరువాయి

ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి ఘరానా మోసం చేశారంటూ మండిపడ్డారు. శ్రీశైలం క్షేత్ర అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని షర్మిల విమర్శించారు. "మల్లన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? రూ. 1,657 కోట్లతో పెండింగ్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ మీకు కనిపించలేదా?" అని ఆమె ప్రశ్నించారు. ఉజ్జయిని, వారణాసి కారిడార్ల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ శ్రీశైలం మల్లన్న కారిడార్‌పై ఎందుకు లేదని నిలదీశారు. శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, ఇది మల్లన్నకు చేస్తున్న ద్రోహం కాదా? అని అన్నారు.

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై కూడా షర్మిల పలు ప్రశ్నలు లేవనెత్తారు. 11 ఏళ్ల క్రితం తిరుపతిలో చెప్పిన పాత పిట్టకథనే ప్రధాని మళ్లీ చెప్పారని విమర్శించారు. ఢిల్లీకి, రాష్ట్ర రాజధానికి లింక్ పెట్టారని, కానీ అరకొర అప్పులు ఇస్తే అమరావతి ఢిల్లీతో

ఎలా పోటీ పడుతుందని ప్రశ్నించారు. కేవలం అప్పులకు హామీలు ఇచ్చినంత మాత్రాన రాష్ట్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందా? అని నిలదీశారు. రాజధానికి లక్ష కోట్ల అప్పులు తెస్తే రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారుతుందని, ప్రగతి ద్వారాలు ఎలా తెరుచుకుంటాయని ఆమె అన్నారు.

## మావోయిస్టు ఉద్యమానికి పెను దెబ్బ: ఒకేసారి 200 మంది లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

మావోయిస్టులు శుక్రవారం ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బస్తర్‌లో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి సమక్షంలో ఈ చారిత్రాత్మక లొంగుబాటు కార్యక్రమం జరగనుంది. కొన్నేళ్లుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పెనుసవాలుగా మారిన మావోయిస్టు ఉద్యమాన్ని ఈ ఘటన తీవ్రంగా దెబ్బతీసింది. ప్రభుత్వ విధానాలు, భద్రతా బలగాల కృషితోనే ఇది సాధ్యమైందని బస్తర్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని బలహీనపరచడంలో తాము సఫలమవుతున్నామని చెప్పడానికి ఈ భారీ లొంగుబాటే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. హింసను వీడి వచ్చే మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానం సత్ఫలితాలనిస్తోంది. ఈ విధానం కింద లొంగిపోయిన వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వారు తిరిగి సమాజంలో గౌరవంగా బతికేందుకు అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తోంది. గత కొద్ది రోజులుగా మావోయిస్టుల లొంగుబాట్లు గణనీయంగా పెరిగాయి. కేవలం ఒక్క రోజు క్రితమే టాప్ కమాండర్ రూపేశ్‌తో సహా 170 మంది లొంగిపోయారు. అంతకుముందు, అక్టోబర్ 15న సుక్మా జిల్లాలో రూ. 50 లక్షల సమష్టి బహుమతి ఉన్న 27 మంది మావోయిస్టులు ఆయుధాలు అప్పగించారు. గత రెండు రోజుల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 258 మంది లొంగిపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు,

2026 మార్చి 31 నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరాలని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన మావోయిస్టులకు పిలుపునిచ్చారు. ఉద్యమంలోని అంతర్గత విభేదాలు, స్థానిక ప్రజల నుంచి మద్దతు కరువవడం వంటి కారణాలతో మావోయిస్టులు లొంగుబాటుకు మొగ్గుచూపుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీకి వర్ష సూచన... మూడు జిల్లాలకు అలర్ట్

- మొదటి పేజి తరువాయి

రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు పొలాల్లో ఉండవద్దని ప్రత్యేకంగా సూచించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లో కూడా పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.

## పరకామణి చోరీ కేసు: టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యవహారంలో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) వ్యక్తిగతంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా, టీటీడీ అధికారుల తీరుపై న్యాయమూర్తి అసహనం ప్రదర్శించారు. కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యంపై ప్రశ్నించారు. ఈ నెల 27న జరిగే తదుపరి విచారణకు ఈవో కచ్చితంగా హాజరుకావాలని, లేనిపక్షంలో రూ. 20 వేల జరిమానా విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని టీటీడీ తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు ఈ విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు, ఇప్పటికే తిరుమల పరకామణిలోని కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తునకు సంబంధించిన ప్రాథమిక నివేదికను, సీజ్ చేసిన ఫైళ్లను శుక్రవారం కోర్టుకు సమర్పించారు. గతంలో రవికుమార్ అనే ఉద్యోగి పరకామణిలో భారీగా అవకతవకలకు పాల్పడినట్లు 2023లో ఆరోపణలు వచ్చాయి. అయితే, అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ అధికారులు ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా లోకాయుక్త ద్వారా రాజీ కుదిర్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయస్థానం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతోంది.

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆ దంపతులకు కొన్ని అపోహలున్నాయని, ఇది వెనుకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వారు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ, తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనడం వల్ల కమిషన్‌కు లేదా ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని అన్నారు. దీనిపై సిద్ధరామయ్య స్పందించారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లుగా ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఇది ఏడు కోట్ల జనాభా సర్వే అని ఇప్పటికి ఇరవై సార్లు చెప్పామని అన్నారు. వారు ఏది కావాలంటే అది రాసుకోనివ్వండని, ఈ సర్వే దేని గురించో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోకుంటే తానేం చేయగలనని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు నెలకు రూ. 2 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఈ పథకాల్లో అగ్రవర్ణ మహిళలు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న మహిళలులేరా అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. ఈ సర్వేపై పలుమార్లు ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చినప్పటికీ వారి అపోహలు తొలగిపోలేదని ఆయన అన్నారు. కేంద్రం ఇప్పుడు కులగణనతో ముందుకు వస్తుందని, దీనిపై నారాయణమూర్తి దంపతులు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

## నటుడు విజయ్ టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

- మొదటి పేజి తరువాయి

సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ గుర్తింపును రద్దు చేయడంతో పాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిని సీజే జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జీ అరుల్ మరుగణ్‌ల ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టులో వాదనలు వినిపించారు. టీవీకే పార్టీకి గుర్తింపు లేనందున ఆ పార్టీకి ఆ హోదా రద్దు చేయాలనే అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపారు. మరోవైపు, కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు మినహా ఈ కేసుల విచారణకు ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటినీ హైకోర్టు పాలనా వ్యవహారాల విభాగం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

# గ్రామ ప్రజలకు అండగా శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి



చిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**పద్మనాభం,పెన్ పవర్, అక్టోబర్ 17 :** విలాస్ ఖాన్‌పాలెం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం స్థానిక ప్రజల్లో విశేష స్పందనను రేపింది. గ్రామ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మొత్తం 91 మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.విజయనగరానికి చెందిన శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ శిబిరానికి వైద్య అధికారిగా డాక్టర్ వి. సంధ్య హాజరై వివిధ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు బి. సన్యాసి నాయుడు, కె. శ్రీనివాసరావు, ఆర్. ముత్యా ల నాయుడు తదితరులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు తరచుగా నిర్వహించడం ఎంతో అవసరమని, ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# “సీమంతం”వేడుకతో పోషణ మాసం 2025 ముగింపు

గర్భఫలం భగవంతుడు ఇచ్చిన గొప్ప బహుమతి

పోషకాహారం విలువలు తెలియక "అమ్మతనం" కు దూరమై పిల్లలకై ఐ వి ఫ్ కేంద్రాలకు పరుగు.





**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 17:** జీవీఎంసీ జోన్ 2 పరిధి 13వ వార్డు ఆరిలోవ కాలనీ లాస్ట్ బస్టాప్ దగ్గర గల జీవీఎంసీ కల్యాణ మండపంలో పోషణ మాసం 2025 ముగింపు సందర్భంగా వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో సొంత నిధులతో 35 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎఫ్.ఆర్.యు డాక్టర్ అనిత, యూపీహెచ్సీ డాక్టర్ కిరణ్ లలిత,సిపిడిఓ నీలిమ, ఏసిడిపిఓ శ్రీ లలిత, అంగన్వాడి సూపర్వైజర్ వినిష, సీమంత కార్యక్రమంలో ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు పౌష్టికాహారం లోపం యుక్త వయసు లో తీసుకోవలసిన పౌష్టికాహారంతీసుకోకపోవడం, వివాహం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం పిల్లల కోసం ఐవిఎఫ్ కేంద్రాలను ఆశ్రయించడం వలన ఐవిఎఫ్ కేంద్రాలు పెరుగుతున్నాయని వీటికి ప్రధాన కారణం ఆహారపు అలవాటు లేనని పౌష్టికాహారం తీసుకోవడంతో వీటికి చెక్కు పెట్టవచ్చునని అని అన్నారు.డాక్టర్ అనిత మాట్లాడు తూగర్భ నిర్ధారణ అయిన మొదటి నుండే వైద్య పరిరక్షణలో ఉండాలని ముఖ్యంగా తీసుకునే ఆహారం పోషక పదార్థాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రతినెల పరీక్షలు తప్పనిసరి అన్నారు. డాక్టర్ కిరణ్ లలిత మాటాడుతూ గర్భం దాల్చడం భగవంతుడు ఇచ్చిన గొప్ప బహుమతి అని దంపతులు అదృష్టవంతులన్నారు. కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్క గర్భిణీ పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని,డాక్టర్లు సలహాలు సూచనలతో గర్భిణీ స్త్రీలు జాగ్రత్త వహించాలని తెలిపారు.కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కార్పొరేటర్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఆర్పీలు మహిళా పోలీసులు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జిమ్నాస్టిక్ ఇండోర్ స్టేడియంలో ‘సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్’ ఎగ్జిబిషన్





కలెక్టర్ హరేందిర ప్రసాద్ సందర్శన

**విశాఖ దక్షిణం,పెన్ పవర్,అక్టోబర్ 17 :**జిల్లాలో జీఎస్టీ అవగాహన కార్యక్రమాల భాగంగా పాండురంగాపురంలోని జిమ్నాస్టిక్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ‘సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్’ ఎగ్జిబిషన్ కమ్ సేల్ కార్యక్రమం శుక్రవారం సందడిగా సాగింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో క్రీడా పరికరాలు, హస్తకళా ఉత్పత్తులు, మరి యు స్థానిక కళాకారుల తయారీ వస్తువులు ఆకర్షణగా నిలిచాయి. క్రీడాకారులు, విద్యార్థు లు, సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్టాళ్లను సందర్శించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ప్రదర్శనను పరిశీలించి, అందుబాటులో ఉంచిన క్రీడా సామగ్రి మరియు హస్తకళా ఉత్ప త్తులను వీక్షించారు. కార్యక్రమం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన నిర్వాహకులను అభినందించారు

కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విధమైన ప్రదర్శనలు స్థానిక ప్రతిభను వెలికి తేవడమే కాకుండా, ప్రజ ల్లో జీఎస్టీపై అవగాహన పెంపొందించడంలో సహాయపడతాయి” అని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి వెంకటే శ్వరరావు, సెట్విస్ సీఈఓ కవిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విశాఖలో గూగుల్ ఏ.ఐ హబ్‌తో కొత్త దశ

## ప్రారంభం ప్రణవ్ గోపాల్ ఫైర్

### వైసీపీకి గూగుల్ రాక మింగుడు కాకపోవడం దురదృష్టకరం!



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 17 :**విశాఖలో గూగుల్ సంస్థ ఏర్పాటు రాష్ట్రానికి మైలురాయిగా నిలుస్తుందని, ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ అన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా విశాఖలో ప్రపంచంలోనే అతిపెద్ద ఏ.ఐ డేటా సెంటర్, గూగుల్ గీగావాట్ ప్రాజెక్ట్ స్థాపనకు దారి తీసిందని ఆయన పేర్కొన్నారు.గూగుల్ లో ఎన్ని ‘ఓ’ లు ఉన్నాయో కూడా తెలియని వారు దాని విలువ గురించి మాట్లాడటం హాస్యాస్పదం అని ప్రణవ్ గోపాల్ విమర్శించారు. వైసీ పీ నేత గుడివాడ అమర్ నాథ్ వ్యాఖ్యలు అజ్ఞా నానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

మర్రి చెట్టుకి ఎన్ని వేర్లు ఉన్నాయో లెక్క చెప్ప మని అడగడం ఎంత అర్థరహితం అయితే, గూగుల్ ఎన్ని ఉద్యోగాలు ఇస్తుందో వెంటనే చెప్పమని డిమాండ్ చేయడం కూడా అంతే” అని వ్యాఖ్యానించారు.ప్రణవ్ గోపాల్ అన్నారు గూగుల్ విశాఖలో సాధారణ కాల్ సెంటర్ కాదు, ప్రపంచ స్థాయి ఏఐ హబ్ నిర్మిస్తోంది. దీని ప్రభావం రాష్ట్రంలో వేలు సంఖ్యలో ఉద్యో గాలు, ఉపాధి అవకాశాలను తెస్తుంది. డేటా ఆపరేషన్స్, ఐటీ, ఇంజనీరింగ్, రవాణా, హౌసిం గ్, ఆతిథ్యం రంగాల్లో విస్తృతమైన ఉపాధి లభిస్తుంది.అలాగే గూగుల్ సబ్‌సీ గేట్‌వే ద్వారా విశాఖ ప్రపంచ సముద్ర కేబుల్ నెట్‌వర్క్‌కి అనుసంధానమవుతుందని తెలిపారు.

దీంతో విశాఖ గ్లోబల్ ఏఐ %౧% ఇంటర్నెట్ కనెక్టివి టీ హబ్’గా అవతరిస్తుంది. ప్రపంచ ఐటీ సంస్థ లు ఇప్పుడు సిటీ ఆఫ్ డెస్టినీ వైపు చూపు సారి స్తున్నాయి, అన్నారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, డిజిటల్ రంగ విస్తరణకు గూగుల్ ప్రాజెక్ట్ ప్రేరణగా నిలుస్తుందని ప్రణవ్ గోపాల్ చెప్పారు.

వైసీపీ నేతలు ఫేక్ వార్తలు సృష్టించి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలను భయపెట్టాలనుకోవడం పిచ్చిపని. అలా చేయడం ఎవరి తరం కాదు, అన్నారు.

గుక్క తిప్పుకోకుండా ఇంగ్లీష్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలపై మంత్రి నారా లోకేష్ గారితో ఓపెన్ డిబేట్‌కి గుడివాడ గానీ, జగన్ రెడ్డి గానీ రావా లి. ధైర్యం ఉంటే రండి” అని ఆయన సవాల్ విసిరారు.

రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టి స్తాం. ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు ద్వారా 9.5 లక్షల ఉద్యోగాల ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర అభివృద్ధి పయనం ఎవరు అడ్డుకోలేరు.

# ప్రజా సేవలో అగ్రగామి - అధికార కర్మయోగి అవార్డు ఘనత

## అల్లూరి జిల్లా కలెక్టర్ ఏ ఎస్, దినేష్ కుమార్ కి

### భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఎ.ఎస్. దినేష్ కుమార్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం.



**పాడేరు, పెన్ పవర్,అక్టోబర్ 17:**ప్రజా సేవలో అంకితభావం, పరిపాలనలో పారదర్శకత, ఆవిష్కరణాత్మక కార్యక్రమాల అమలు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ కి విశిష్ట గౌరవం దక్కింది. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేయబడే అధికార కర్మయోగి ఉత్తమ ప్రదర్శన అవార్డు కి ఆయన ఎంపిక కావడం జిల్లావాసులు గర్వకారణంగా మారింది.

జిల్లా పరిపాలనలో పలు విభాగాల్లో దినేష్ కుమార్ చేపట్టిన వినూత్న చర్యలు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో పాలన, విద్యా–ఆరోగ్య రంగాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణ, పౌరసౌకర్యాల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చూపిన కృషి ప్రశంసనీయమని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.

రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వేడుకలో ఈ అవార్డును స్వీకరించిన దినేష్ కుమార్, "ఇది వ్యక్తిగత గౌరవం కంటే జిల్లా పరిపాలనలోని ప్రతి అధికారికి, సిబ్బందికి దక్కిన గుర్తింపు" అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తన బృందం సహకారం, ప్రజల విశ్వాసమే ఈ విజయానికి ప్రేరణగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ ఘనతకు జిల్లావాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజల కోసం నిరంతర కృషి చేసిన కలెక్టర్‌కు ఇంతటి గౌరవం లభించడం జిల్లా గర్వకారణం, అని అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కూటమి ప్రభుత్వ మోసాలను బహిర్గతం చేద్దాం



- వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపు
- కోటి సంతకాల ఉద్యమంతో ప్రజల్లోకి వెళ్తాం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 17 :**పేదల కోసం నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభు త్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలతో కలిసి అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆసీల మెట్ట కార్యాలయంలో దక్షిణ వైసీపీ శ్రేణులకు 'కోటి సంతకాల సేకరణ ఉద్యమ' కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా ప్రయోజన కార్యక్రమాలను అబద్ధాల ముసుగు లో దెబ్బతీసే కుట్రను కూటమి ప్రభుత్వం నడుపుతోందని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి పేదలు కూడా డాక్టర్లు కావాలని, వారికి నాణ్య మైన వైద్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను నిర్మించారు. కానీ ఇప్పుడు ఆ ప్రజా సంపదను చంద్రబాబు బంధువులు, అనుచరుల చేతుల్లోకి అప్పగించే కుట్ర జరుగుతోంది," అని వాసుపల్లి మండిపడ్డారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 8,480 కోట్లతో 17 మెడికల్ కాలే జీలు, రూ. 10,032 కోట్లతో విలేజ్ క్లినిక్స్ నిర్మిం చిందని గుర్తుచేశారు. 105 రకాల మందులు, 14 పరీక్షలు గ్రామస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. పేదలకు వైద్యం హక్కుగా మార్చిన జగనన్న పాలనలో అభివృద్ధి స్పష్టంగా కనిపిం చింది, అని ఆయన తెలిపారు.

చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా ప్రారంభించలేదని, ఇప్పుడు జగనన్న ప్రారంభించిన అభివృద్ధిని నేలమట్టం చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

పేదల హక్కుల కోసం, ప్రజా సంపద రక్షణ కోసం కోటి సంతకాల ఉద్యమాన్ని ప్రతి ఇంటికి తీసుకె ళ్తాం. ప్రజల న్యాయహక్కు కోసం జగన్‌నే ఒకే ఆశ్రయం, అని వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా నాయకులు, దక్షిణ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తప్పుడు కమిటీ తీర్మానాలతో, ఆశా కార్యకర్తల పోస్టులు నియామకం తక్షణమే రద్దు చేయాలి.



**పాడేరు,పెన్ పవర్,అక్టోబర్ 17:** ఆశ కార్యకర్త పోస్టులు నియామకంలో తప్పుడు కమిటీ తీర్మానాలతో నియామకాలు జరిగింది. తక్షణమే రద్దు చేయాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: ఆశా కార్యకర్తల పోస్టుల నియామకంలో ఆయా పంచాయితీల పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, డాక్టర్లు కమిటీ తీర్మానాలను ఆమోదిస్తూ ఆశా కార్యకర్తల నియాకలు జరిగిందని, అది తప్పుడు కమిటీ తీర్మానాలని తక్షణమే రద్దు చేయాలి ఈరోజు గ్రీవెన్స్ లో ట్రైనింగ్ కలెక్టర్ గారికి వినతి ఇవ్వడం జరిగింది.

అదేవిధంగా పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ చింతగరువు గ్రామానికి చెందిన %ూచీవీ% ట్రైనింగ్ చేసిన వంతల సత్యవతికి ఆశ కార్యకర్త పోస్ట్ నియమించకుండా వేరే వాళ్ళకి నియమించారని, అదేవిధంగా జీకే వీధి మండలం సీలేరు గ్రామంలో నిబంధనాలకు వ్యతిరేకంగా బీసీ మహిళకు కమిటీ తీర్మానాలు ఇచ్చిందని,ఇంతకన్నా దుర్మార్గమైన చర్య ఇంకేం ఉండదని, అదేవిధంగా అనంతగిరి మండలం కరివేసి గ్రామంలో బోయిని గంగమ్మకు మరియు ఇంకో ఆమెకు ఊర్లోనే బ్రతకటం లేదని కమిటీ తీర్మానంతో వేరే వాళ్ళకి ఆశ పోస్టు నియమించారని, బోయిని గంగమ్మ అనే ఊరిలోనే బ్రతుకుతుండగా ఊర్లో బ్రతకటం లేదని తీర్మానం చేయటం చాలా దుర్మార్గమని, తప్పుడు కమిటీ తీర్మానాలతో ఆశ కార్యకర్తల పోస్టులు నియామకం జరిగిందని తక్షణమే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి వెంకట పడాల్, జె నాగేశ్వరరావు, కే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వంపూరు గంగులయ్య ఆధ్వర్యంలో జి.మాడుగుల జనసేన కోర్ కమిటీ సమావేశం

### స్థానిక సంస్థల ఎన్నికలకు వ్యూహరచన



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం వారీగా జనసేన పార్టీ నిర్వహిస్తున్న కోర్ కమిటీ సమావేశాల భాగంగా శుక్రవారం జి.మాడుగుల మండల కోర్ కమిటీ సమావేశం జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ ,మరియు పార్టీ ఇంచార్జి డాక్టర్ వంపూరు.గంగులయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ గంగులయ్య కోర్ కమిటీ సభ్యులకు మార్గదర్శనం చేస్తూ జి.మాడుగుల మండలం పరిధిలోని పంచాయతీలు, ఎంపీటీసీ సెగ్మెంట్లు, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో గెలుపు అవకాశాలు ఉన్న వారిని గుర్తించి, బలమైన బృందాన్ని తయారు చేయాలని సూచించారు.మండల అధ్యక్షులు మసాద భీమన్న మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించేలా అభ్యర్థుల ఎంపికకు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తుది నివేదిక సమర్పిస్తామని తెలిపారు.డాక్టర్.వంపూరు గంగులయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నాయకులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జి.మాడుగుల మండల అధ్యక్షులు మసాద భీమన్న,పిఎసిఎస్ చైర్మన్ తల్లే త్రిమూర్తి, బూత్ కన్వీనర్ కొర్ర భాను ప్రసాద్, జల్లి బుజ్జిబాబు, సాగిన బాలకృష్ణ, బట్టి అంగదర్ రావు, కొరబు చరణ్, రెగం అప్పలకొండ బాబు, రీమేలి నర్శిబాబు, పాడేరు మండల అధ్యక్షులు నందోలి మురళీ కృష్ణ, అశోక్ తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

## హైవే బాధితుల సమస్య పరిష్కరించకే హైవే పనులు చేపట్టాలి





లేదంటే ఉద్యమం చేస్తాం.

**పాడేరు,పెన్ పవర్,అక్టోబర్ 17:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ పలు సమస్యలపై అధికారులు దృష్టికి - పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు .

%చీఎ 516 జు% జాతీయ రహదారి విస్తరణలో బాగంగా కాపీ తోటలు మరియు పంట భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించకే రోడ్డు పనులు చేపట్టాలని ఈరోజు పాడేరు ఐటీడీఏలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాడేరు శాసన సభ్యులు వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు తో పాటు బాధితులు పెద్ద సంఖ్యలో హాజరై ఐటిడిఏ పిఓ ఇంచార్జ్ సబ్ కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కి వినతిపత్రం అందజేశారు.

విశ్వేశ్వర రాజు అధికారులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటు దాని ఆధారంగానే ఆధారపడి సహజీవనం ఉంటూ కాపీ తోటలు మరియు పంట భూములు రోడ్డు విస్తీర్ణంలో నష్టపోతున్న జీ.కే.వీధి మండలం. పెదవలస, రంపుల చాపరాతిపాలెం, మరియు జి.మాడుగుల మండలం వంజారి పంచాయితీ, వంజరి, ములకాయ పుట్టు, గెమ్మెలి పంచాయతీ వరిగెలపాలెం, కడగడ్డ, గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు, కావున అధికారులు తక్షణమే ప్రత్యేక చొరవ తీసుకొని బాధితులకు న్యాయం జరిపి రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు.లేని పక్షాన న్యాయం జరిగేంతవరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘ నిధుల దుర్వినియోగంపై వినతిపత్రం!



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 17:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం సంకాడ పంచాయతి పరిధిలో గత నెల విడుదలైన 15వ ఆర్థిక సంఘ నిధుల దుర్వినియోగం అయ్యాయి అంటూ జనసేన నాయకులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగయ్యకి, అలాగే జిల్లా కలెక్టరుకు ఈ వినతిపత్రంను సంకాడ పంచాయతి జనసేన అధ్యక్షులు ఊలం ఈశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ "ప్రజల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పారదర్శకంగా వినియోగించాలి. ప్రజల డబ్బు ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడకూడదు" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మార్కెట్ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి, జనసేన నాయకులు ఇంటి రాజబాబు, అలాగే ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై మంటలు మహాత్ముల ఆశయాలకు అవమానం!



- దక్షిణ వైసీపీ నాయకుల వినూత్న నిరసన
- విగ్రహాల వద్ద శుభ్రతా కార్యక్రమం, పూలమాలలతో నివాళి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 17** :రాజ్యాంగాన్ని తునాతునకలు చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుపై దక్షిణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. 27వ వార్డులో మా జీ ఎమ్మెల్యే, దక్షిణ వైసీపీ సమన్వయకర్త వాసు పల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో నిర్వహిం చిన వినూత్న నిరసన కార్యక్రమంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగజీవన్ రావు విగ్రహాలను శుభ్రపరచి, పూలమాలలతో ఘనంగా నివాళు లర్పించారు.

మహాత్ములారా మన్నించండి అంటూ ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజల్లో చైతన్యం రేకెత్తించింది. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ,రాజ్యాంగం చెప్పిన సమానత్వం, న్యాయం, సంక్షేమం అనే మహా త్ముల ఆశయాలను కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. నారా లోకేష్ చేతుల్లో రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోంది అని తీవ్రంగా విమర్శించారు.

జగన్మోహన్ రెడ్డి నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని, విశాఖ భూ ములను బినామీలకు, పెద్ద కంపెనీలకు దారాద త్తం చేస్తూ పేదలకు గజం భూమి కూడా ఇవ్వ కుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ రాజ్యాంగం పేదల హక్కులను కాపాడేందుకేనని, ఆ హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో దక్షిణ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, మహాత్ముల విగ్రహాల వద్ద మౌన దీక్ష చేపట్టి నివాళులర్పించారు.

## పంచాయితీల్లో ఆదాయ వనరులను సృష్టించుకోవాలి

సర్పంచ్ లకుఎంపీడీవో ప్రసాదరావు సూచన




**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 17:**
పంచాయితీలు స్వంత ఆదాయ వనరులు సృష్టించుకుంటే స్వయం పాలన, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని ఎంపీడీవో ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో బాబూరావు, ఏవో బాలమురళికృష్ణతో కలిసి సర్పంచ్‌లు, కార్యదర్శులకు మొదటి రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీలకు చెందిన ఆస్తులను గుర్తించాలన్నారు. పంచాయతీ వనరులను ఆర్థిక వనరులుగా మలుచుకోవాలని సర్పంచులకు ఎంపీడీవోసూచించారు.

## అంటబొంగులో డ్రైనేజీ నిర్మాణం ప్రారంభం

- గతంలో జెడ్పీ నిధులు 5 లక్షలతో 100 మీటర్లు నిర్మాణాన్ని గతంలో శంకుస్థాపన.
- సర్పంచ్ సీసా పార్వతి, ఎంపిటిసి కోడా నబ్బో.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 17.**మండలంలో గల బరడ పంచాయతీ అంటబొంగు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం పనులు ప్రారంభించినట్లు పంచాయతీ సర్పంచ్ సీసా పార్వతి, ఎంపిటిసి కోడా నబ్బో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో జిల్లా పరిషత్ నిధులు 5 లక్షల రూపాయలుతో 100 మీటర్ల డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, దానికి సంబంధించి శుక్రవారం పనులు ప్రారంభించమన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఆలస్యమైందని, ఐదు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో జెడ్పి నిధులు కేటాయించిన జిల్లా చైర్పర్సన్ కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సీసా బాలరాజు, విక్రమ్, గ్రామస్తులు కోడా గురు, త్రినాధ్, వాసుదేవ్, సొన్ను, రామారావు, బుధు తదితరులు పాల్గొన్నారు



# ప్రజలు కోసమే ప్రజా దర్బార్

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్..



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 17 పెన్ పవర్.** ప్రజా సమస్యలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నాడు క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు వచ్చి మంచినీటి,రోడ్డు సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు.సమస్యలు విన్న ఎమ్మెల్యే సమస్యల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తూ సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమానికి కూటమే నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

## 22 నుంచి మాల ధారణ స్వాములకు అన్నదానం



**అల్లిపురం పెన్ పవర్ అక్టోబర్ 17:** శ్రీహరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు మండలకాల మహా అన్న ప్రసాద వితరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు కంచుమూర్తి వెంకటరమణమూర్తి తెలిపారు. వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్వామి మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ఏ మాలనైనా ధరించి దీక్షలో ఉన్న భక్తులకు సుచికరమైన రుచికరమైన మడితో వండిన భోజనం అందించేందుకు సంకల్పించామని చెప్పారు. ఈ బృహత్తర అన్నదాన కార్యక్రమానికి విశాఖలోని ఆధ్యాత్మిక మహాశయులు, అయ్యప్ప స్వామి భక్తులు సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరారు. భక్తి భావంతో వస్తురూపణ గాని బియ్యం పప్పుదినుసులు, కాయగూరలు వంటివి స్వీకరిస్తామన్నారు. ఎవరైనా భక్తి భావంతో సమర్పించే విరాళాలు శ్రీ హరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం పేరున అందించి, రసీదు పొందవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో శ్రీ కోదండ రామాలయ కమిటీ అధ్యక్షులు కే. కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు, గురుస్వామి కడగల శ్రీను,
ఆలయ అధ్యక్ష కార్యదర్శులు కే సుబ్రహ్మణ్యం, కే శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు కోరాడ అప్పారావు రామకృష్ణారెడ్డి, పి.అవతార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.ద

# చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో విశేష పూజలు

450 మంది భక్తులకు అన్నసంతర్పణ!





**భిమిలి, పెన్ పవర్, అక్టోబర్ 17 :** శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఆశ్వయుజ మాసం కృష్ణ పక్ష ఏకాదశి శుక్రవారం సందర్భం గా మధురవాడ చంద్రంపాలెం జాతరగట్టు శ్రీదు ర్గాలమ్మ అలయంలో విశేష పూజా కార్యక్రమా లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్యార్చనతో పూజలు ప్రారంభమై కుంకుమార్చన, పుష్పార్చన వంటి పూజలు అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, హరిచరణ్ తదితరులు నిర్వహించారు. అనంతరం కర్పూ రహారతి, నీరాజన మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
సాయంత్రం వేళ అమ్మవారికి పంచామృతా భిషేకం, సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసి, పూలతో సుందరంగా అలంకరించి, ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి కర్పూరహారతి చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనతో భక్తులు ఘనంగా పాల్గొన్నారు.ప్రతి శుక్రవారం ఆలయం లో భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించడం ఆనవాయితీగా ఉండగా, ఈ శుక్రవారం వాంద్రాసి పెంటయ్య గారి కుటుంబ సభ్యులు ు వాంద్రాసి అప్పారావు, కనకారావు, శ్రీను, పైడికొండ మరియు కుటుంబ సభ్యులు ు ఆర్థిక సహకారంతో 450 మంది అయ్యప్పస్వా ములు, భక్తులు, పేదలకు అన్నప్రసాదం అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్ర శేఖర్, కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోటి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పిళ్లా మోహన్ శివకృష్ణ, కమిటీ సభ్యులు పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, బోగవిల్లి రాము, పిళ్లా రమణ, మరుపిల్లి ఆనంద్, పిళ్లా రాజు, కేశనకుర్తి అప్పారావు, దుర్గాశి సోంబాబు, గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, పీస రామారావు, ముఖ్య సభ్యులు జగుపిల్లి అప్పారావు, పిళ్లా పోతరాజు, జగుపిల్లి చిన్న, పి.వెంకటరమణ, వాంద్రాసి అప్పారావు, సుందర శ్రీను తదిత రులు పాల్గొన్నారు.
అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కుని ఆశీర్వాదం పొందారు.




## బాధిత కుటుంబాలకు 5 లక్షలు ఆర్థిక సహాయం.

- విద్యార్థుల మరణాలు కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యమే.
- బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం 25 లక్షలు పరిహారం ఇవ్వాలి.
- విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.
- శాసనమండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. డిమాండ్ చేశారు.



**గుమ్మలక్ష్మీపురం,కురుపాం అక్టోబర్ 17 పెన్ పవర్.** కురుపాం మండలం గురుకుల సంక్షేమ పాఠశాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థునుల కుటుంబ సభ్యులకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆదేశాల మేరకు కురుపాం మండలం దండు సూర గ్రామంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా,జడ్పీ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు,మాజీ ఉపముఖ్యమంత్రులు, రాజన్న దొర,పుష్పశ్రీవాణి, మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్ష రాజు,పాలకొండ, పార్వతీపురం,బొబ్బిలి మాజీ ఎమ్మెల్యేల సమక్షంలో కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు చొప్పున చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ. విద్యార్థినుల మరణాలకు గల కారణం కూటమి ప్రభుత్వం దేనని ఇది కేవలం ప్రభుత్వ హత్యనని అన్నారు. బాధిత కుటుంబాలకు ఒకొక్కరికి 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వతంత్రం వచ్చాక ఇలాంటి నిర్లక్ష్యమైన ప్రభుత్వాన్ని నేను ఎన్నడూ చూడలేదని బొత్స వ్యాఖ్యఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ. వందల మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైన మిగిలిన విద్యార్థులను ఇంతవరకు స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేసే తల్లిదండ్రులకు భరోసా ఇవ్వలేదన్నారు. బాధ్యులైన



గిరిజన శాఖ మంత్రి గాని, విద్యా శాఖ మంత్రి గాని ఎందుకు విద్యార్థుల కుటుంబాలను ఇప్పటివరకు పరామర్శించలేకపోయారని కనీస బాధ్యతను మర్చిపోయారని ఆయన ఖండించారు. ఇప్పటికీ గురుకుల పాఠశాలను తెరవలేక పోయారని. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని పుష్ప శ్రీవాణి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో. నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక ఆరోగ్య సురక్షకు కొత్త అడుగు 'సఖి సురక్ష' ప్రారంభం





**విశాఖ దక్షిణం, పెన్ పవర్,అక్టోబర్ 17 :** స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక, పోషకాహార ఆరోగ్యాన్ని కాపాడుతూ వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రూపొందించిన 'సఖి సురక్ష' కార్యక్ర మంను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృ ష్ణ శ్రీనివాస్ శుక్రవారం డ్వాక్రా బజార్ వద్ద ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ, మహిళల సమగ్ర అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని పేర్కొన్నా రు. స్వయం సహాయక సంఘాల మహిళలు కుటుంబం, సమాజానికి ఆర్థిక బలాన్ని అందిం చే శక్తివంతమైన స్థంభాలు. వారి ఆరోగ్య పరిర క్షణ, పోషకాహార అవగాహనతో పాటు మాన సిక సౌఖ్యం కోసం సఖి సురక్ష పథకం ఒక దిశా నిర్దేశకంగా ఉంటుంది, అని ఆయన అన్నారు.
కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాల వివరాలను కూడా తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో పలు వార్డుల నుంచి మహిళా సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి అమానుషం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు.

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 17:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడి అమానుషం, అనైతకం అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు అన్నారు. చీఫ్ జస్టిస్ పై దాడిని ఖండిస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అనంతరపు రాజు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే
దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలన్నారు.
ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టి, చీఫ్ జస్టిస్ పై అహంకారంతో దాడి చేసిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 7, 2025 రోజున భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాజేష్ కిషోర్ అనే వ్యక్తి షూస్ విసిరి దాడికి పాల్పడడం న్యాయవ్యవస్థ పై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ దుశ్చర్య న్యాయవ్యవస్థ చరిత్రలో మాయని మచ్చగా ఉందని అన్నారు. చీఫ్ జస్టీస్ మీద జరిగిన దాడి అనాగరికమైందని, ఈ దాడి దేశవ్యాప్తంగా ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది అన్నారు. దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. దేశ ప్రజలందరూ ఈ దాడిని ముక్తకంఠంతో ఖండించాలని, దాడికి పాల్పడ్డ వ్యక్తి పై తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి అన్నారు. దాడి వెనుక ఉన్న అసాంఘిక శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా సమగ్రమైన దర్యాప్తు జరిపించాలి అన్నారు. సత్వర న్యాయం కోసం సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జీలను దర్యాప్తు కోసం నియమించాలి అలాగే ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం



కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ డిమాండ్లను తక్షణమే పరిగణలోని తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్వో కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు, శశి వెంకటేష్, పలివెల దొరబాబు, జొన్నాడ విజయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎం.ఎస్.ఎం.ఈ.పార్క్‌తో పద్మనాభం కొత్త దిశలో గంటా శ్రీనివాసరావు





- భీమిలి అభివృద్ధి దిశగా గంటా పాదయాత్ర పారిశ్రామిక వేత్తల దృష్టి విశాఖపై
- పద్మనాభంలో టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారం
- ఘాట్ రోడ్డులో విద్యుత్ దీపాలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటుకు హామీ

**పద్మనాభం, పెన్ పవర్ అక్టోబర్ 17 :** భీమిలి నియోజకవర్గాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం పద్మనాభం మండలంలో కొత్తగా నియమితమైన టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.
రాష్ట్రంలో మొట్టమొదటి ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్ కు పద్మనాభం మండలమే ఆతిథ్యం ఇస్తోందని గుర్తు చేసిన ఆయన, అనంతవరం, కొవ్వాడ తదితర ప్రాంతాల్లో భూసేకరణ జరుగుతోంది. పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించేలా ప్రణాళికాబద్ధంగా ముందు కెళ్తాం అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అందులో రూ.6 లక్షల కోట్లు విశాఖ పరిసర ప్రాంతాలకునే ఆకర్షించామని తెలిపారు.2014%-%19 మధ్య భీమిలి అభివృద్ధికి రూ.4,700 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలు ఇచ్చిన విశ్వాసానికి తగినట్లుగా మళ్లీ అదే స్థాయిలో అభివృద్ధి పనులు చేపడతాం అని హామీ ఇచ్చారు.
అనంత పద్మనాభస్వామి ఘాట్ రోడ్డులో విద్యు త్ దీపాలు, కొండపై మంచినీటి సదుపాయాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. "పద్మనాభం మండలం టీడీపీకి అజేయ కోట. పార్టీ స్థాపన తర్వాత ఒక్కసారి మాత్రమే ఇక్కడ మెజారిటీ తగ్గింది. ఈసారి అన్ని స్థానాల్లో ఏకపక్ష విజయం సాధిద్దాం అని కార్యకర్తలను ఉత్సాహపరిచారు.ఎన్నికల ముందు చంద్రబా బు తనను విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయమన్నప్పటికీ, భీమిలి ప్రజల సంకల్పంతో భీమిలినే ఎంచుకున్నానని గంటా తెలిపారు. "సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా కొనసాగుతాయి అన్నారు.
యువ నాయకుడు గంటా రవితేజ మాట్లా డుతూ, విశాఖను ప్రపంచస్థాయి ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో మంత్రి నారా లోకేష్ ముందంజలో ఉన్నారని, గూగుల్ డేటా సెంటర్ భీమిలిలో స్థాపన ఆ దిశలోనే ముఖ్యమైన అడుగని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, పాండ్రంగి రామరాజు, కాళ్ల నగేష్ కుమార్, మజ్జి నందీశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, కురుమిన లీలావతి, నందిని తదితరులు పాల్గొన్నారు.

# రాములు వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ కు వినతి

- పాడేరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పణ.
- వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 17.** అల్లూరి జిల్లా, పాడేరు ఐటిడిఏలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముంచంగిపుట్టు మండలంలో గల ఇందిరా కాలనీ ఆర్ అండ్ బి రహదారి నుండి రాములు వరకు ఉన్న బీటీ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని అల్లూరి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించినట్లు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు పాటు బోయి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో రాములు వరకు నిర్మించిన బీటీ రోడ్డు పూర్తిగా పాడైందని, బ్రిడ్జిలు శిథిలవస్థకు చేరాయని దీంతో సరిహద్దు గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు ఆయన తెలిపారు. రహదారి ఆనుకొని ఉన్న దారపల్లి, గడ్డిబంద, వర్కుగుమ్మి, ఇల్లోయిపొల్లం, రాములు గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వాహనంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంబులెన్స్ కూడా రావటానికి వీలుపడటం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన వెల్లడించారు. రహదారి, కల్వర్టుల మరమ్మతులకు జిల్లా కలెక్టర్ చొరవ చూపి మరమ్మతు పనులు తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు.

# కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలి...

ఎంపీడీవో సత్య సాయి శ్రీనివాస్..






**నాతవరం,పెన్ పవర్ (అక్టోబర్ 17):** గ్రామ పంచాయతీలలో వనరులను ఏ విధంగా సమకూర్చుకోవాలి,పంచాయితీలో ఏఏ సేవా కార్యక్రమాలు చేపట్టాలి అన్న విషయంలో కేరళ రాష్ట్రం ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో సత్య శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రమైన నాతవరంలో గల మండల పరిషత్ సమావేశ మందిరం లో పంచాయితీలలో సొంత ఆదాయ వనరులు ఎలా సమకూర్చుకోవాలి అనే అంశంపై సర్పంచులకు,పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీడీవో సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో అన్ని పంచాయతీలలో మూడు శాతం ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీలలో పారిశు ధ్యం, త్రాగునీటి నిర్వహణ,వీధి దీపాలు ఏర్పాటు తదితర పనులు చేస్తున్నారన్నారు. సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి పంచాయతీలలో ఉన్న షాపులు లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని,అలాగే బిల్డింగ్ ప్లాన్ ఫీజులు వసూలు చేయాలని,చేపల చెరువు తదితర ఆదాయ వనరులపై దృష్టి సారించి పంచాయతీలలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన పశ్చిమ ఎమ్మెల్యే





**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 17 :** తెలుగుదేశం పార్టీ అధినేత మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయనిధి నుండి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గోపాలపట్నంలోని విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై, లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. బాధితులకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 9 మందికి రూ.3లక్షల,38 వేల 556 విలువైన చెక్కులు పంపిణీ చేయబడ్డాయి. జీవీఎంసీ 59వ వార్డు, గణపతి నగర్, పెనుమజ్జి చందన రూ.25వేలు, 61వ వార్డు, మల్కాపురం, సర్వసిద్ధి శ్రీలక్ష్మి రూ.42వేల 378లు, 90వ వార్డు, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, తిరుమ రెడ్డి లిఖిత రూ.38వేల 180లు, 92వ వార్డు, వెంకటాపురం, కుమ్మరి వీధి ఎస్. అప్పారావు, రూ.21వేల 986లు, 92వ వార్డు, గోపాలపట్నం, శ్రీరామ్ నగర్ చె.అనురాధ రూ.20వేలు, 92వ వార్డు, ఇందిరా నగర్, పిల్ల లక్ష్మి, రూ.41వేలు,084లు, 92వ వార్డు, వెంకటాపురం, కంచిపాటి భూలోకమ్మ, రూ.15వేలు413లు, 92వ వార్డు, వెంకటాపురం, కుమ్మరి వీధి, నీలపు చంద్ర శేఖర్ రూ.21వేలు 431లు, 62వ వార్డు, మల్కాపురం, జనతా కాలనీ, పెతకంశెట్టి అభిషేక్ రూ.41వేలు 084లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మూర్తిపట్నాయక్, కంపర ఆనంద్, చింతడ పద్మావతి, ఆర్ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు. వారందరూ ఈ కార్యక్రమాన్ని సాఫల్యవంతంగా నిర్వహించడంలో చురుకుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రజలకు సహాయం అందించడంలో ప్రభుత్వం చూపుతున్న చొరవను ప్రసంశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజాప్రేమను కొనియాడుతూ, రాష్ట్రంలో పేదలకు, బాధితులకు అండగా నిలిచే పాలన కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు.

# విద్యార్థులను అనుక్షణం పర్యవేక్షణ.

విద్యార్థులకు రక్త పరీక్షలు. నిర్వహించిన. దుడ్డుఖల్లు పీహెచ్సీ సిబ్బంది.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 17,పెన్ పవర్.** మండలంలోగల దొరజమ్మ,దుడ్డుఖల్లు,గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు,దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,జిల్లా వైద్య అధికారి మరియు మలేరియా అధికారి వారి ఆదేశాల మేరకు,గురువారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు.సమక్షంలో ప్రతి ఒక్క విద్యార్థికి రక్త పరీక్షల నిర్వహించి,విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశు భ్రత గూర్చి అవగాహన కల్పిస్తూ తగు జాగ్రత్తలు సూచించారు.ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు పరిశు భ్రతల పాటించి మంచి క్రమశిక్షణతో మెలిగి,విద్యారంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని,అలాగే ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకొని విద్యార్థుల కు ఎలాంటి ఇబ్బంది వచ్చిన తక్షణమే ఆరోగ్య సేవలు అందించే విధంగా తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు,ఈ కార్యక్రమంలో పాఠశాల వార్డెన్,నిమ్మక.వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయ సిబ్బంది,చిన్నారావు,పీ.డి. మురళి,చక్రపాణి,ఆనంద్, మరియు హెల్త్ అసిస్టెంట్స్ :-పీ.గోవింద్,జి. రాజేష్,వి.రమేష్. పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం

- ,ప్రభుత్వ వైద్య కళాశాల పిపిపి పరం కానీయం
- ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం
- 12 వ వార్డు వైయస్సార్సీపి కమిటీ తీర్మానం ఆమోదం

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 17:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి. జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే కే రాజు. విశాఖ తూర్పు నియోజక వర్గ సమన్వకర్త మొల్లి అప్పారావు.ఆదేశాలు మేరకు, కూటమి ప్రభుత్వం,ప్రభుత్వ మెడికల్ కాలేజిలను ప్రైవేట్ పరం చేస్తున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం చేపట్టాలని పిలుపు ఇవ్వడం జరిగినదని, కార్యాచరణ విషయమై శుక్రవారం సంతపాలెం,12 వ వార్డు వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బూత్ కన్వీనర్స్ తో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగినదని, కార్యక్రమం 12 వ వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్ అధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుల గొప్ప ఆలోచనతో వైద్యవిద్య అనేది పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న పరిస్థితులను గ్రహించి,ప్రతీ పేదవాడు వైద్య విద్య అభ్యనించాలని,పార్టీ అధికారంలో రాగానే,17 మెడికల్ కాలేజీలకు నిర్మాణాలు ప్రారంభించి 5 మెడికల్ కాలేజీలు పూర్తి చేసి,మిగిలినవి నిర్మాణంలో ఉండటం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమేనని, ప్రభుత్వ మెడికల్ కాలేజిలను,ఇప్పటి కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసి,వారి అనుయాయులకు పిపిపి పద్ధతిలో ప్రభుత్వ కాలేజీలను దారాదత్తం చేసే ఉద్దేశ్యంతో,పేదవారికి వైద్య విద్య దూరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ చేయాలని,దానికి ప్రతీ ఒక్కరు ఇంటిఇంటికి వెళ్ళి,కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు చేస్తున్న మోసాన్ని తెలియపరచి, మద్దతుగా వారి వద్ద సంతకాలను సేకరించాలని, ఈయొక్క కార్యక్రమం 12 వ వార్డులో అత్యధికంగా సంతకాలు సేకరించి,అన్ని వార్డులకు తలమానికంగా వుండాలని తీర్మానించినట్లు తెలిపారు. తెలియజేయడం జరిగినది.కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి. వార్డు ఉపాధ్యక్షుడు బుడుమూరి వినోద్. యువజన విభాగం అధ్యక్షుడు ఒమ్మి వెంకటప్పరావు,వార్డు ఎస్.సి సెల్ ప్రెసిడెంట్ సత్యనారాయణ,మెట్ట సూర్యనారాయణ,వార్డు ప్రధాన కార్యదర్శి సూర్యారావు అర్జున్,వార్డు సోషల్ మీడియా అధ్యక్షులు జేమ్స్,బూత్ కన్వీనర్స్ మోహన్ సంతోష్ రమణ. సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదరిక నిర్మూలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 17:** పేదరికాన్ని నిర్మూలించి ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపరచే దిశగా కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మాజీ జిల్లా టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్ అన్నారు.జీకే వీధిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల్లో భాగంగా జిఎస్టీ తగ్గింపు, పి4 విధానం అమలు, ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడం, పలు రకాల మొక్కల పెంపకం, పింఛన్ల పెంపు వంటి పథకాలతో ఆర్థిక సమతుల్యతను సాధించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు."ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం ద్వారా పేదరిక నిర్మూలన దిశగా సుస్థిరమైన అడుగులు వేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జీకే వీధి మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు చెక్క నాగరాజు, జీకే వీధి మండల టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గుంట బుజ్జి బాబు, టిడిపి కార్యకర్తలు గెమ్మెలి రాంబాబు, గెమ్మెలి శివ, సత్తిబాబు, వంతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# కీ.శే. అవగడ్డ బంగారులక్ష్మీకి నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 17 :** స్థానిక పెందుర్తి నియోజకవర్గ వాలంటీర్ విభాగం అధ్యక్షులు అవగడ్డ శ్రీనివాస్ తన మాతృమూర్తి, కీ. శే. అవగడ్డ బంగారులక్ష్మీ దశదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ సీనియర్ నాయకులతో కలిసి కార్యక్రమానికి హాజరై, బంగారులక్ష్మీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 97వ వార్డు అధ్యక్షుడు మెంతి మహేష్, 95వ వార్డు అధ్యక్షుడు రాపర్తి మాధవరావు, మండల పార్టీ అధ్యక్షుడు గోరపల్లి శ్రీను, మాజీ పాక్స్ చైర్మన్ గొర్ల రాము నాయుడు, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, నాయకులు దొగ్గ గౌతమ్, బొడ్డు ప్రకాష్, బంగారు నాయుడు, మూలి నాయుడు, హేమంత్, గణపతి, రాజు, నక్క మహేష్, ఉగ్గిన నాగార్జున, వేపాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సాగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని, బంగారులక్ష్మీ గారి స్మృతిని స్మరించుకున్నారు.

# జలవనరుల సంరక్షణ, ప్రజా పథకాల వేగవంతం






- విశాఖను నంబర్ వన్‌గా తీర్చిదిద్దే సంకల్పం
- ఎం.పీ. భరత్
- దిశా సమావేశంలో అధికారులపై దృష్టి సారించిన ఎం.పీ
- మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపకల్పన

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 17 :** విశాఖ జిల్లా అన్ని రంగాల్లో దేశంలో ఆదర్శంగా నిలవాలని, అందుకోసం ప్రతి విభాగం సమన్వ యంతో పని చేయాలని ఎం.పీ.భరత్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ మా నిటరింగ్ కమిటీ దిశా సమావేశంలో ఆయన అధికారులను సమీక్షించారు.జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్ల విస్తరణ, గృహ నిర్మాణ పథకాల పురోగతి, తాగునీటి సరఫరా, విద్యా వసతులు, పర్యావరణ సంరక్షణ తదిత ర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అమలును పరిశీలించిన ఆయన, భవిష్యత్ ప్రణాళికపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

ఎంపీ భరత్ మాట్లాడుతూ విశాఖపట్నం అభి వృద్ధి వేగం మరింత పెరగాలి. నేషనల్ హైవేలు నగర రహదారులతో అనుసంధానమయ్యేలా చర్యలు వేగవంతం చేయాలి. కేంద్ర పథకాల ఫలాలు ప్రతి అర్హుడి వరకు చేరాలన్నది మా లక్ష్యం, అని తెలిపారు.గృహ పథకాలపై మాట్లాడుతూ, రాజీవ్ గృహకల్పలో మిగిలిన ఇళ్లను తక్షణం లబ్ధిదారులకు అందజేయాలని, అనధికారికంగా ఉన్నవారిని తొలగించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ యూనిట్లను విస్తృతంగా నెలకొల్పాలని చెప్పారు. రోడ్ల తవ్వకాలు పూర్తయిన చోట వెంటనే పూడ్చివేత జరగాలని, టిడ్కో గృహ సముదాయాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.

జలవనరుల సంరక్షణకు ప్రాధాన్యం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని జల వనరుల సంరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎంపీ భరత్ ఆదేశించారు. “భూగర్భ జలాలు పెరిగేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలి. వర్షపు నీటి సేకరణ, టెర్రస్ గార్డెనింగ్ ప్రోత్సహించాలి,” అని సూచించారు.

అర్హులకే దుకాణాల కేటాయింపు వెండింగ్ జోన్ల గుర్తింపులో పారదర్శకత పాటించాలని, అర్హుల కే దుకాణాల కేటాయింపు ఉండాలని ఎంపీ భరత్ స్పష్టం చేశారు.దళారులు, మధ్యవర్తుల పై కఠిన చర్యలు తీసుకోవాలి. జీవనోపాధి కోసం కష్టపడే వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలి,” అని పేర్కొన్నారు.

సమావేశంలో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గణబాబు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. టిడ్కో గృహ సముదాయాల్లో సదుపాయాల కల్పన, డైమండ్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను చర్చించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సూచించబడిన ప్రత్యామ్నాయ హెడ్డింగ్‌లు (మీరు ఎంపిక చేసుకోవచ్చు):**

1. “విశాఖకు దేశంలో మొదటి స్థానం కావాలి” ఎంపీ భరత్ దిశా సమావేశంలో స్పష్టం
2. మౌలిక వసతుల అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చిన ఎంపీ భరత్
3. జలవనరుల సంరక్షణ, ప్రజా పథకాల వేగవంతం విశాఖను నంబర్ వన్‌గా తీర్చిదిద్దే సంకల్పం

# మెగా డీఎస్సీ పేరుతో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం

**జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య.**



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 17:-** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ పేరుతో గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు తీరని అన్యాయం చేసిందని జెడ్పిటిసి పోతురాజు బాలయ్య మండిపడ్డారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం జరగదని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన గిరిజన సంక్షేమ మంత్రి గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఏం సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖలోని ఉపాధ్యాయ ఖాళీలన్నీ ఆయా ఐటీడీఏ పరిధి ప్రాజెక్టు అధికారుల సమక్షంలోని రిక్రూట్మెంట్ జరిగేదని ప్రస్తుతం మాత్రం గిరిజన సంక్షేమ శాఖలోని ఖాళీలు డీఎస్సీలో కలపడం అన్యాయం అన్నారు. దీనికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వత్తాసు పలకడం విడ్డూరంగా దారుణంగా ఉందన్నారు. గిరిజన ప్రతినిధిగా గిరిజన ప్రాంతాల్లోని సమస్యలు అధిష్టానం దృష్టిలో పెట్టి సమస్యలను పరిష్కారానికి కృషి చేయవలసిన మంత్రి ఆ దిశగా ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ జిపిఎస్ పాఠశాలలోని ఖాళీలు కూడా గిరిజనేతర అభ్యర్థులతో నింపడాన్ని తీవ్రంగాఖండిస్తున్నామన్నారు. ఈ చర్యల వల్ల గిరిజన నిరుద్యోగ అభ్యర్థులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ లోకల్ అభ్యర్థులు కూడా ఆశ్రమ జిపిఎస్ పాఠశాలలో నియమించడాన్ని ఆయన తప్పుపట్టారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు ఐటీడీఏ పరిధిలోనే పనిచేయాలని బదిలీలు కూడా ఆయా ఐటీడీఏ ల పరిధిలోనే జరుగుతాయని మైదాన ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉండదని అన్నారు దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది నూతన ఉపాధ్యాయులు ఎంతో కొంత ఇచ్చి వాలంటీర్లను పెట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అదే జరిగితే సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలో నియమించిన ఉపాధ్యాయులు స్థానికంగా నివాసం ఉండి విధులు సక్రమంగా నిర్వహించి నాణ్యమైన విద్యను అందించాలని ఆయన కోరారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక చాలా ఇబ్బందుల్లో ఉన్నారని ఉన్న చిన్నపాటి అవకాశాలు కూడా దక్కకుండా పాలకులు అవకాశాలను దూరం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే కాఫీలు విరుగుగా పండే గిరిజన ప్రాంతంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టవలసి ఉన్నప్పటికీ మైదాన ప్రాంతమైన మాకవరపాలెం మండలం శెట్టి పాలెంలో పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది కూటమి ప్రభుత్వ కుట్రలో భాగంగానే తాము భావించాల్సి వస్తుందని అన్నారు. ఎన్నికల ముందు జీవో నెంబర్ 3 బదులు ప్రత్యామ్నాయ జీవో తీసుకువచ్చి గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ ఖాళీలన్నీ గిరిజన నిరుద్యోగ యువతకే ఇస్తామని చెప్పి, ఇప్పుడు గిరిజన యువతకు ముందు చేయి చూపిస్తారని ఆయన దవ చేశారు.కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ గిరిజన ప్రాంతాల్లో నిర్మిస్తే గిరిజన నిరుద్యోగ యువతకు కొంతైన ఉపాధి అవకాశాలు దొరికే ఉండేవని అది కూడా దక్కకుండా కూటమి ప్రభుత్వం చేసిందని ఆయన దియబద్దారు. గిరిజనులపై ప్రభుత్వాలు చేసే కుట్రలను తిప్పికొట్టవలసిన సమయం వచ్చిందని దీనికి గిరిజన మేధావులు నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు ఒక వేదిక పైకి వచ్చి ఒకే ఎజెండాతో హక్కుల చట్టాల కోసం పోరాడాలని ఆయన తెలిపారు.

## అప్పన్న ఆలయంలో రూ.5 కోట్లతో పైకప్పు పునరుద్ధరణ

**గంటా శ్రీనివాసరావు చొరవతో అద్భుత సంరక్షణ**





**సింహాచలం, పెన్ పవర్, అక్టోబర్ 17 :** శతాబ్దాల నాటి చారిత్రాత్మక శిల్పకళను కలిగిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి సింహాచలం ఆలయంలో పైకప్పు పునరుద్ధరణ పనులు సుమారు రూ.5 కోట్ల వ్యయంతో విజయవంతంగా పూర్తియ్యాయి. ఈ పునరుద్ధరణ కార్యక్రమం భీమిలి శాసనసభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు చొరవతో, ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావు సమన్వయంతో, పూణేకు చెందిన శ్రీ వెంకటేశ్వర ఆధ్యాత్మిక చారిటబుల్ ట్రస్టు ద్వారా నాలుగు నెలల పాటు నిర్వహించబడింది. పనులు పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి పర్యవేక్షణలో శాస్త్రీయ పద్ధతుల్లో, చున్నం%–%బెల్లం%–%కర్రరాయి మిశ్రమంతో సంప్రదాయ శిల్పకళను ఆధారంగా చేసుకుని పూర్తయ్యాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, “ఇకపై రెండు శతాబ్దాలపాటు పైకప్పుకు ఎటువంటి ప్రమాదం ఉండదని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది నా దైవప్రేరణ. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలకు నిత్యం సన్నద్ధంగా ఉంటానని తెలిపారు. ట్రస్టు సభ్యులు, పురావస్తు శాఖ, దేవస్థానం అధికారులు, మరియు నిపుణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పనుల పూర్తిని పురస్కరించుకొని శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావు, పురావస్తు శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. వేదాశీర్వచనాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు ఈ పునరుద్ధరణతో ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక వారసత్వంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఆలయాల పరిరక్షణ అంటే భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడటం,” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురాతన దేవాలయాల సంరక్షణకు సమాజం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# బాణాసంచా అనుమతి లేకుండా వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు- సీఐ వినోద్ బాబు

**చింతపల్లి పెన్ పవర్ అక్టోబరు 17 :-** చింతపల్లి మండలం లో దీపావళి బాణాసంచా విక్రయం చేయదలచిన వారు తప్పనిసరిగా ముందుగానే అనుమతులు పొందాలని చింతపల్లి సీఐ వినోద్ బాబు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, భద్రతా ప్రమాణాలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని సూచించారు.సీఐ వినోద్ బాబు మాట్లాడుతూ, దీపావళి సందర్భంగా ప్రజలంతా భద్రతా నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించాలి. బాణాసంచా దుకాణదారులు లైసెన్స్ పొందిన ప్రాంతాల్లోనే విక్రయాలు నిర్వహించాలి. పిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే బాణాసంచా పేల్చాలి. విద్యుత్ వైర్లు, ఇంధన ట్యాంకులు, వాహనాల దగ్గర బాణాసంచా కాల్చరాదు, అని సూచించారు.అలాగే, చట్టబద్ధంగా అనుమతులు పొందిన విక్రేతలు మాత్రమే వ్యాపారం జరపాలని, ప్రజలు కూడా అలాంటి షాపుల నుంచే కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖ దీపావళి సందర్భంగా రాత్రిపూట కూడా పర్యవేక్షణను మరింతగా పెంచుతుందని సీఐ తెలిపారు.



# విశాఖ జిల్లా వైఎస్ఆర్సీపి ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా

**భూమిరెడ్డి వెంకటరెడ్డి ని నియమించిన అధిష్టానం**



**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబర్ 17:** పార్టీకి వెన్నంటి నడచి కష్టపడి పని చేసిన వారిని పార్టీ గుర్తిస్తుంది అనేదానికి వైఎస్ఆర్సిపి కే సాధ్యం అని పార్టీ ఆవిర్భావం నుండి కష్టపడిన నన్ను గుర్తించి విశాఖ జిల్లా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా నియమించి, ఉన్నత బాధ్యతలు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి రుణపడి ఉంటానని భూమి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.విశాఖ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేకే రాజు.తూర్పు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మొల్లి అప్పారావు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి.మరియు వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులకు13వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాల తెలియజేస్తున్నానని విశాఖ జిల్లా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి వెంకటరెడ్డి తెలియజేశారు.

# సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయండి - ఎస్సై వెంకటేశ్వరరావు






**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 17 :-** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శు క్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్%–×ఎ% ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు సమాజంలో కొత్త ముప్పుగా పరిణమిస్తున్నాయని ఎస్సైవెంకటేశ్వరరావు పేర్కొన్నారు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి కాని, దాని వల్ల వచ్చే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు బ్యాంకు యాప్‌లు, ఫోన్‌పే, గూగుల్ పే, క్రెడిట్ కార్డు, లాటరీ, ఉద్యోగ ఆఫర్‌లు, షాపింగ్ సైట్లు పేరుతో మోసాలు చేస్తున్నారు. వీటిలో ఏదైనా అనుమానాస్పద లింకులు లేదా సందేశాలు వచ్చినా వాటిని క్లిక్ చేయకుండా వెంటనే తొలగించాలని విద్యార్థులకు సూచించారు. తమ వ్యక్తిగత వివరాలు బ్యాంకు ఖాతా నంబర్లు, ఓటీపీ, ఆధార్, పాన్, పాస్‌వర్డ్‌లు వంటి సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు. ఎవరి మాటకు మోసపోకుండా సాంకేతిక అవగాహన పెంచుకోవాలి. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి లేదా %ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.ఱఅ% వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలి. వేగంగా స్పందిస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చు అని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో విద్యార్థులు టెక్నాలజీతో పాటు బాధ్యత కూడా నేర్చుకోవాలి. సైబర్ సురక్ష అంటే కేవలం హ్యాకింగ్ భయం కాదు, అది మన వ్యక్తిగత గోప్యత, భవిష్యత్తుకు కవచం. ప్రతి విద్యార్థి ఈ అవగాహన కార్యక్రమాల ద్వారా సైబర్ శ్రద్ధను అలవరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సైబర్ నేరాల నిరోధకతపై పోస్టర్లు ప్రదర్శించి, విద్యార్థుల్లో అవగాహన కలిగించారు.

# పేదలకు ఉచిత వైద్యం హక్కును క్షీణం చేసిన కూటమి వాసుపల్లి ఆందోళన



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 17 :** పేదలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాల్సిన హక్కును కూటమి ప్రభుత్వం క్షీణత పరచిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఎద్దేవా చేశారు.వాసుపల్లి శుక్రవారం 27వ వార్డులో దక్షిణ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలసి “కోటి సంతకాల సేకరణ” ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కలను నిజం చేసేందుకు 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ప్రారంభించారని, అయితే కూటమి ప్రభుత్వం అవి పూర్తి అయ్యే ముందు రాజకీయ లాభాల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్దకు అప్పజెప్పుతున్నదని ఆరోపించారు.వినియోగదారులకు ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వ హక్కును క్షీణం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం వై.ఎ స్. జగన్ ప్రభుత్వం ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీలు కూటమి ప్రవర్తన కారణంగా ప్రైవేటీ కరణకు గురవుతున్నాయి, అని వాసుపల్లి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు మరియు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.